ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్
- సీఈఈ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం

అంబర్‌పేట, జనవరి 10: బాగ్‌అంబర్‌పేట డివిజన్ సెంట్రల్ ఎక్సైజ్ (సీఈ) కాలనీలో రూ.6 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అవసరమైన చోట కొత్త డ్రైనేజీ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశామని, ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామకృష్ణరాజు, ప్రధాన కార్యదర్శి పడాల వెంకట్రావు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, నాయకులు శ్రీరాములుముదిరాజ్, టి.రమేశ్, చంద్రశేఖర్‌గౌడ్, సునీల్, శ్రీహరి, కవితారావు, పల్లె భారతిరెడ్డి, బంగారు శ్రీను, క్రాంతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

ఈస్ట్‌జోన్ డీసీపీ సాయిశ్రీ

అంబర్‌పేట, జనవరి 10: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఈస్ట్‌జోన్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. ఎల్బీనగర్ డీసీపీగా పనిచేసిన ఆమె బదిలీపై ఈస్ట్‌జోన్‌కు వచ్చారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డీసీపీ బుధవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. ఈస్ట్‌జోన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 2010 బ్యాచ్‌కు చెందిన డీసీపీ మొదట్లో కాకినాడ, వైరాల్లో డీఎస్పీగా పని చేశారు. అనంతరం ఖమ్మం డీటీసీ వైస్ ప్రిన్సిపాల్‌గా, హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో డీఎస్పీగా, ఇంటలిజెన్స్ విభాగంలో అడిషనల్ ఎస్పీ, ఎస్పీగా పని చేశారు. అక్కడ నుంచి జనవరి 2023లో ఎల్బీనగర్ డీసీపీగా వెళ్లారు. ఏడాది పాటు అక్కడ డీసీపీగా పని చేసిన సాయిశ్రీ బదిలీపై ఇటీవల ఈస్ట్‌జోన్‌కు వచ్చారు.

అయ్యప్పస్వామి మహాపడిపూజలో పాల్గొన్న కృష్ణమోహన్‌రావు

ఆధ్యాత్మిక చింతనతో భక్తిభావం

కాచిగూడ, జనవరి 10: ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని తెలంగాణ బీసీ కమీషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. లక్కాకుల ప్రవీణ్‌కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో తుల్జాభవన్‌లో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమానికి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. పడిపూజలో అయ్యప్పస్వాములతో పాటు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, కె.సదానంద్, మహేశ్‌కుమార్, శేషు, శ్రీకాంత్‌యాదవ్, రాము పాల్గొన్నారు.

పార్శిగుట్ట రోడ్డులో పైపులైన్ పనుల షురూ..

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

ముషీరాబాద్, జనవరి 10: రాంనగర్-పార్శిగుట్ట ప్రధాన మార్గం, బ్రహ్మంగారి టెంపుల్ కమాన్ వద్ద నిలిచిపోయిన పైప్‌లైన్ నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. 'రోడ్డును తవ్వారు.. చోద్యం చూస్తున్నారు' శీర్షికతో 'నమస్తే తెలంగాణ దినపత్రిక'లో బుధవారం వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు ఎట్టకేలకు పైపులైన్ పనులు మొదలు పెట్టారు. యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. పనులు మొదలు కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మంగారి టెంపుల్ కమాన్‌లైన్‌లో ప్రారంభించిన పైప్‌లైన్ నిర్మాణ పనులు

ప్రహారీ నిర్మాణ పనుల పరిశీలన

అంబర్‌పేటలో ఏర్పాటు చేస్తున్న ముస్లిం శ్మశానవాటిక ప్రహారీ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. - గోల్నాక, జనవరి 10

రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, జనవరి 10: భోలక్‌పూర్‌లో రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. భోలక్‌పూర్ డివిజన్‌లోని భోలక్‌పూర్ హౌజ్ వద్ద బుధవారం కవాడిగూడ, ముషీరాబాద్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కవాడిగూడ, ముషీరాబాద్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గోపాల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహ, అసోసియేషన్ అధ్యక్షుడు జి.రాకేశ్ గుడినియా, ఉపాధ్యక్షుడు టి.సంజీవ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పీఎస్ రాజు, బీఆర్‌ఎస్ నాయకులు ఎ.శంకర్ గౌడ్, ఆర్.శ్రీనివాస్, ఉమాకాంత్ ముదిరాజ్, నర్సింగ్ రావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

జాంబాగ్ డివిజన్‌లోని హిందీనగర్ చర్చ్ గల్లీలో బుధవారం వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్. - అబిడ్స్, జనవరి 10

మానవీయ కోణంలో రచనలు సాగాలి

రచయితలు మానవీయ కోణంలో తమ రచనలు సాగించాలని వక్తలు సూచించారు. ప్రముఖ నాటక రచయిత భజరప్ప స్మారకార్థం 'సిరిముువ్వ కల్చరల్' ఆధ్వర్యంలో తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో బుధవారం నాటకోత్సవం నిర్వహించి ప్రముఖ రంగస్థల రచయిత గోపి సత్యప్రకాష్‌కు భజరప్ప రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. ఆచార్య డి.ఎస్.ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో రచయిత, నటులు కె.వి బలరామమూర్తి, డాక్టర్ హరిశ్చంద్ర, రామకోటేశ్వరరావు, నర్సింహారావు, సిరిమువ్వ సంస్థ కార్యదర్శి పెరుమాళ్ళు తదితరులు పాల్గొన్నారు. - తెలుగు యూనివర్సిటీ, జనవరి 10

ముగిసిన నాట్యమేధ,నృత్య

రవీంద్రభారతి, జనవరి10: అభినయ వాణి నృత్య నికేతన్ స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నాట్యమేధ, నృత్య సాంప్రదాయ కూచిపూడి నృత్యప్రదర్శనను నిర్వహించారు. నాట్యగురువు చావలి బాలాత్రిపురసుందరి తన తండ్రి జ్ఞాపకార్థం నృత్యరూపక నాట్య ప్రదర్శన రెండోవ రోజు బుధవారం వైభవంగా ముగిసింది. కీర్తిరెడ్డి, శారదదేవి, ప్రొఫెసర్ డా.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి నూతన ఎండీకి సన్మానం

జలమండలి నూతన ఎండీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సి.సుదర్శన్‌ను బుధవారం సన్మానిస్తున్న డబ్ల్యూడబ్ల్యూఈయూటీ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, బి.జైరాజ్, పి.నారాయణ, సయ్యద్ అలీ, రామచంద్రారెడ్డి, జంగయ్య, లక్ష్మీనారాయణ, జమీల్ అహ్మద్, నర్సింగ్ రావు తదితరులు. - అబిడ్స్, జనవరి 10

ముగ్గుల పోటీల్లో బహుమతులు ప్రదానం

కార్వాన్, జనవరి 10: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కార్వాన్‌లోని హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ముగ్గులు వేసిన వారికి బహుమతులు అందజేయడంతో పాటు పాల్గొన్న వారందరికి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ముత్యాల భాస్కర్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి.శశిధర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మహిళా సంఘం అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రధాన కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలి

కాచిగూడ, జనవరి 10: క్రైస్తవులకు నామినేటెడ్ పదవులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని క్రిస్టియన్ జాయింట్ కమిటీ అధ్యక్షుడు ఎం.సాల్మన్‌రాజు విజ్ఞప్తి చేశారు. బుధవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రైస్తవుల కుటుంబాల సంక్షేమానికి లక్ష రూపాయల మంజూరుకు నిర్ణయం తీసుకుందని, అదే విదంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేద క్రిస్టియన్ సోదరుల అభివృద్ధికి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేసీసీ కార్యదర్శి డాక్టర్ కె.వి.యెన్, జాకబ్, సంయుక్త కార్యదర్శి రాజేశ్, సుదేశ్, కెన్నీ, జయకుమార్, పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కాచిగూడ, జనవరి 10: తెలంగాణ ప్రైవేటు జూనియర్ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం బర్కత్‌పుర లోని రత్నా జూనియర్ కళాశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.ఉమాశంకర్, ప్రధాన కార్యదర్శిగా పి.సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా సీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అహ్మద్‌హుస్సేన్, ఎండీ ఉస్మాన్, జాయింట్ సెక్రటరీగా సిద్ధిఖీ, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌరీసతీశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి ప్రభుత్వం పెద్దపీట

కాచిగూడ, జనవరి 10: ఆర్టీసీ ఉద్యోగుల, కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని హైదరాబాద్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కాచిగూడ డిపో లో బుధవారం ఉద్యోగ, కార్మికులకు వనభోజనల మహోత్సవాలకు వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రిజినల్ మేనేజర్ బి.వరప్రసాద్, డిప్యూటీ ఆర్.ఎం జగన్, కాచిగూడ రైల్వేస్టేషన్ డైరెక్టర్ బాలాజీ, కాచిగూడ డిపో మేనేజర్ టి.రఘు, రైల్వే సీహెచ్ఐ జగన్‌మోహన్‌రెడ్డి, డిపో సీఐ శ్రీనివాస్, రాములుతోపాటు డిపో సిబ్బంది పాల్గొన్నారు.

'అందాలరాణి' శ్రావ్య చిల్లక్రౌన్

ఢిల్లీలోని నోయిడాలో బుధవారం 'మిస్ అండ్ మిసెస్ ఇండియా క్విన్ ఆఫ్ హార్ట్స్' సంస్థ నిర్వహించిన అందాల పోటీల్లో సౌత్ ఇండియా తరుపున హైదరాబాద్‌కు చెందిన శ్రావ్య చిల్లక్రౌన్ అందాల రాణిగా నిలిచింది. సౌత్ ఇండియా క్రౌన్‌తోపాటు 'మిస్సెస్ ఫిట్', 'మిసెస్ పర్ఫెక్ట్ బాడీ 2024' సబ్ టైటిల్‌ను కూడా సాధించడం జరిగిందని విజేత శ్రావ్య తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ఇద్దరు పిల్లల తల్లి అయినప్పటికీ పట్టుదలతో ఈ అందాల పోటీలో గెలుపొందానని, కుటుంబ సహకారం కూడా మరువలేనిదని శ్రావ్య తెలిపారు. - రవీంద్రభారతి, జనవరి10

క్యాలెండర్ ఆవిష్కరణ

'తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కనకం కొమురెల్లి, అశోక్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు దివాకర్, పవన్‌కుమార్, రామనాథరెడ్డి, లక్ష్మణ్ రావు, ఝాన్సీ రాణి, రామనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. - చిక్కడపల్లి, జనవరి 10

'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' ప్రారంభం

'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'ను బుధవారం అంబర్‌పేట డివిజన్‌లోని పటేల్‌నగర్ చౌరస్తాలో ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎన్.గౌతం రావు, నాగభూషణం చారి, జి.ఆనంద్‌గౌడ్, భిక్షపతి, నవీన్‌రెడ్డి, రాంచందర్ గుప్తా. - గోల్నాక, జనవరి 10

నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై చర్యలు

వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు నంబర్‌ప్లేట్ లేకుండా నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి సీఐ సీతయ్య అన్నారు. బుధవారం నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 10 మందిపై కేసులు నమోదు చేసి, అనంతరం నంబర్ ప్లేట్ పెట్టించి వారిని విడిచిపెట్టామన్నారు. - చిక్కడపల్లి, జనవరి10

కార్మికులకు సంక్షేమ ఫలాలు అందిస్తాం

కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య



చిక్కడపల్లి, జనవరి 10: రాష్ట్రంలోని కార్మికులకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తానని కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో బుధవారం కృష్ణ ఆదిత్య బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘటిత, అసంఘటిత కార్మికులకు సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంగా ముందుకు సాగుతానని, శాఖలో మూడు వెల్ఫేర్ బోర్డులు ఉన్నాయన్నారు. అసంఘటిత కార్మికుల కోసం ప్రవేశపెట్టి 'ఈ-శ్రమ్'లో పథకంలో ఇప్పటి వరకు 41 లక్షల మంది పేర్లను నమోదు చేసుకున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను కార్మిక శాఖ అధికారులు కలిసి ఘనంగా సన్మానించారు.

బీసీల డిమాండ్లను అమలు చేయాలి

జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ, జనవరి 10: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కులాల వారీగా తక్షణమే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కోరారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచాలని, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో చేర్చిన బీసీల డిమాండ్లను వెంటనే అమలు చేయాలన్నారు. విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లను 25 శాతం నుంచి 52 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అన్యాయమే జరుగుతుందని, బీసీలంతా ఏకమై ప్రధాని మోదీని గద్దెదించే రోజు అసన్నమైందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లాల బీసీదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించాలి: ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్
- మల్లేపల్లిలో జీహెచ్ఎంసీ కమిషనర్‌లో కలిసి ఎమ్మెల్యే పర్యటన

మెహిదీపట్నం, జనవరి 10: ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి అధికారులు శాయశక్తులా కృషి చేయాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. బుధవారం నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రె, డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌లతో కలిసి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ పర్యటించారు. ఈ సందర్భంగా మల్లేపల్లి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కమిషనర్ రొనాల్డ్ రాస్‌కు ఎమ్మెల్యే సూచించారు. నాలాల వెడల్పు, సీవరేజీ, తాగునీటి పైప్‌లైన్లు, వీడీసీసీ రోడ్ల నిర్మాణాల పనులను చేపట్టాలన్నారు. స్పందించిన జీహెచ్ఎంసీ కమిషనర్ సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే పనులు ప్రారంభం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఈ లాల్‌సింగ్, ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లేపల్లిలో నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌తో కలిసి పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

కవాడిగూడ, జనవరి 10: గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సంఘం కార్యాలయంలో 2024 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్ మద్దం నర్సింహ యాదవ్, అసోసియేషన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు పి.కృష్ణ, చైర్మన్ పరుశురామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండీ చాంద్ పాషా, కోశాధికారి సి. విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు కనకరాజ్ గౌడ్, ఎండీ అహ్మద్, టి. పాల్గుణ రావు, సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, అన్ని జోన్‌ల అధ్యక్షులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చేతిపైలాన్‌కు మరమ్మతులు చేపట్టాలి

మెహిదీపట్నం, జనవరి 10: నానల్‌నగర్ చౌరస్తాలోని 'చేతిపైలాన్' నిర్వహణ లోపంతో శిథిలంగా మారిందని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ అధ్యక్షుడు కూరాకుల కృష్ణ కోరారు. బుధవారం కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు నానల్‌నగర్ చౌరస్తాలో ఉన్న చేతిపైలాన్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల చంద్రశేఖర్, అబ్దుల్ హమీద్, గిరి, కృష్ణ, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా పాఠశాల వార్షికోత్సవం

తెలుగు యూనివర్సిటీ, జనవరి 10: తెలుగు లలిత కళాతోరణం వేదికపై బుధవారం మలక్‌పేట సలీమ్‌నగర్ కాలనీలోని 'డామ్నిక్ పాఠశాల' 45వ వార్షికోత్సవ వేడుకలు ఉల్లాసంగా జరిగాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు డామ్నిక్ విద్యాసంస్థల కరస్పాండెంట్ అంకితారెడ్డి బహుమతులను అందజేశారు.

సమన్వయంతో పనిచేయాలి

మెహిదీపట్నం, జనవరి 10: ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. తాగునీటి, డ్రైనేజీ సమస్యలపై స్థానిక ప్రజల ఫిర్యాదులు మేరకు నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్‌తో కలిసి ఎమ్మెల్యే బుధవారం టోలిచౌకిలో పర్యటించారు.

అర్ధరాత్రి యువకుల హల్‌చల్

మెహిదీపట్నం, జనవరి 10: కారును ఓవర్‌టేక్ చేసినందుకు ఓ వ్యక్తిపై దౌర్జన్యం చేసి కారు తాళాలు లాక్కుని న్యూసెన్స్ చేసిన ఇద్దరు యువకులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. రాజేంద్రనగర్ శివరాంపల్లికి చెందిన ముర్తుజా అలీ(50) మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మెహిదీపట్నం నుంచి అత్తాపూర్ వైపు తన కారులో వస్తున్నాడు. ఈ క్రమంలో షేక్‌పేట్‌కు చెందిన నజీబుద్దీన్ (24), అష్రఫ్ (23)ల కారును మెహిదీపట్నం పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 10 సమీపంలో ముర్తుజా అలీ వీరి కారును ఓవర్‌టేక్ చేసి ముందుకు వెళ్లాడు. దీంతో కోపోద్రిక్తులైన నజీబుద్దీన్, అష్రఫ్‌లు వెంటనే తమ కారును ముర్తుజా అలీ కారు ముందుకు వెళ్లి అడ్డగించి, ముర్తుజా అలీ కారు తాళాలు తీసుకుని అతడి కారుపైకి ఎక్కి డ్యాన్సులు చేస్తూ రోడ్డుపై న్యూసెన్స్ చేశారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుమాయూన్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నజీబుద్దీన్, అష్రఫ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బుధవారం ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్ వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్/మెహిదీపట్నం, జనవరి 10: విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా గురువారం ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మెహిదీపట్నం సీబీడీ ఏడీఓ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు 11 కేవీ ఖాదీ భండార్ ఫీడర్, 11 కేవీ చాచానెహ్రూ పార్కు ఫీడర్, 11 కేవీ క్రీసెంట్ హాస్పిటల్ ఫీడర్ ప్రాంతాల్లో , మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు 11 కేవీ అహ్మద్‌నగర్ ఓవర్‌హెడ్ ఫీడర్,11 కేవీ అహ్మద్‌నగర్ కేబుల్ ఫీడర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ముషీరాబాద్‌లో..

టీఎస్ఎస్‌పీడీసీ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ వైఎంసీఏ, బసంత్ కాలనీ, ఫీవర్ ఆసుపత్రి, మౌలానా అజాద్ నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ ఎం.విజయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి 11:30గంటల వరకు వైఎంసీఏ ఫీడర్ పరిధిలోని నారాయణగూడ బ్లడ్ బ్యాంక్, లింగంపల్లి వాటర్ వర్క్స్, రాఘవేంద్ర స్వామి టెంపుల్, నృపతుంగ కాలేజ్ పోలీసు క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో, ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు బసంత్ కాలనీ ఫీడర్ పరిధిలోని బసంత్ కాలనీ, లింగంపల్లి, వైశ్య హాస్టల్, వెంకటరమణ థియేటర్, జైన్‌మందిర్, కాచిగూడ ఎక్స్ రోడ్ సరిసర ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 4:30 గంటల వరకు ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలోని అంజయ్య క్వార్టర్స్, ఫీవర్ ఆసుపత్రి, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతాల్లో, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మౌలానా ఆజాద్ నగర్ ఫీడర్ పరిధిలోని చెప్పల్ బజార్, కుమార్ థియేటర్, రహమత్‌బాగ్, పన్నాలాల్ బిల్డింగ్, క్వాలిటీ గార్డెన్ పరిసర ప్రాంతాల్లో కరెంటులో అంతరాయం ఉంటుందని విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **Tuniki Brahma Chary** is the owner of House No.1-1-261/19/1, 1-1-261/19/2, 1-1-261/19/6, 1-1-261/19/7, 1-1-261/19/9, 1-1-261/19/10, land admeasuring 105 Sq.yds., out of 210 Sq.yds., Situated at Chikkadpally, Hyderabad, who acquired the same vide Registered Partition Deed no. 4826/2016 dated 24-12-2016..
Whosoever has got any claims or rights over the above mentioned property. Please contact J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.